సాక్షి
అనంతపురం
బుధవారం । 23 । అక్టోబర్ । 2024



రాష్ట్రంలో అరాచక పాలన
సీఎం చంద్రబాబు రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. 8లో



టమాట కిలో రూ.40
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.23, సరాసరి రూ.33 ప్రకారం విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/22.4°
జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. విస్తారంగా వర్షాలు కురిసినా ఉక్కపోత పెరిగింది. పగలు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు భారీ వరద



తుంగభద్ర జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి మరోసారి వరద నీరు పోటెత్తింది. దీంతో డ్యాం 33 క్రస్ట్ గేట్లలో 18 గేట్లు 3 అడుగులు, 5 గేట్లు 2.5 మేర ఎత్తి 96,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రానికి 1,12,136 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం గల జలాశయంలో ప్రస్తుతం 1631.92 అడుగుల వద్ద 101.461 టీఎంసీల నీరు ఉన్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. మరోవైపు హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,820 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఉత్తమ పంచాయతీగా హంపాపురం

- కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ లక్ష్మిదేవి

అనంతపురం టౌన్: జల సంరక్షణ చర్యల్లో దేశంలోనే ఉత్తమ పంచాయతీగా రాప్తాడు మండలంలోని హంపాపురం నిలిచింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో హంపాపురంలో వాటర్‌షెడ్ నిధులతో 78 రకాల నీటి నిల్వ పనులు చేపట్టారు. ప్రతి ఇంటి వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతతో పాటు సామూహిక నీటి నిల్వ గుంతలు తవ్వారు. చెక్‌డ్యాంలో పూడిక తీత, అమృత్ సరోవర్ పథకం కింద చెరువులో పనులతో పాటు సేద్యపు కుంటలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేశారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన కేంద్ర జలశక్తి అభియాన్ అధికారుల బృందం జల సంరక్షణ చర్యలు బాగున్నాయంటూ కితాబునిచ్చింది. ఈ క్రమంలోనే మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్ రెడ్డితోపాటు గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవికి ఉత్తమ పంచాయతీ అవార్డు అందజేశారు. హంపాపురాన్ని ప్రతి పంచాయతీ ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

రాయదుర్గం ఆస్పత్రిలో నలుగురు వైద్యుల సరెండర్



రాయదుర్గంటౌన్: రాయదుర్గం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని నలుగురు ప్రత్యేక వైద్య నిపుణులను జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్), స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇప్పటికే ఆస్పత్రిలో వైద్యుల కొరతతో రోగులకు మెరుగైన వైద్యం అందడం గగనంగా మారింది. ఏరియా ఆస్పత్రిలో పనిచేసే ఏడుగురు వైద్యులు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో మెడికల్ లీవ్ పెట్టిన వారు తమ సెలవుల పరిధి దాటినా రాకపోవడంతో అధికారులు చర్యలు చేపట్టారు. విజయవాడ డీఎస్‌హెచ్‌ఓకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైద్యుల సరెండర్ నిర్ణయంతో క్షేత్రస్థాయిలో రోగులకు ఇబ్బందులు మరింత తీవ్రం కానున్నాయి. అధికారుల నిర్ణయం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సరెండర్ చేసిన వైద్యులు వీరే..
డాక్టర్ జ్యోతి (డెర్మటాలజిస్ట్), గీతారాణి (పెథాలజిస్ట్), అనంతరామకృష్ణ (సీఏఎస్ జనరల్), మున్వర్ రాజ (జనరల్ సర్జన్).

చెరువులకు జలకళ

అనంతపురం సెంట్రల్: వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. జిల్లాలో మొత్తం 301 చెరువులుండగా 186 చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరాయి. అందులో 61 చెరువులు నూరుశాతం నిండి మరువ పారుతున్నాయి. 14 చెరువులు 75 శాతం, 36 చెరువులు 50 శాతం, 75 చెరువులు 25 శాతం చొప్పున నిండాయి. చెరువుల కెపాసిటీ 6,157 ఎంసీఎఫ్‌టీ కాగా 4,061 ఎంసీఎఫ్‌టీ మేర నీళ్లు చేరాయి. మిగిలిన చెరువుల్లోకి కూడా అరకొరగా నీరు చేరినట్లు చిన్ననీటి పారుదలశాఖ ఎస్‌ఈ నాయక్ తెలిపారు. దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.



బొమ్మనహాళ్ మండలంలో బళ్లారి-కళ్యాణదుర్గం రోడ్డుపై ప్రవహిస్తున్న వేదవతి నది



కృష్ణాపురం వద్ద నేలకొరిగిన వరిపంటను చూపుతున్న రైతు



కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దిలో జలమయమైన ఎస్సీ కాలనీ

వణికించిన వాన



రాప్తాడు మండలం బండమీదపల్లి వద్ద వర్షానికి నీటమునిగిన వరిపంట

- జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు 25.9 మి.మీ సగటు వర్షపాతం
- కళ్యాణదుర్గం, కంబదూరు, ఆత్మకూరులో భారీ వర్షం
- దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యానపంటలు
- రైతులకు కోలుకోలేని నష్టం
- రాగల మూడు రోజులూ వర్షసూచన



వర్షానికి 11 ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బతిందని చెబుతున్న రాప్తాడు మండలం బోగినేపల్లికి చెందిన మహిళా రైతు గుగ్గిళ్ల నాగమణి

అనంతపురం అగ్రికల్చర్: వరుణుడు వానతో వణికించాడు. జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 9 గంటలకు మొదలైన వరుణ హోరు మంగళవారం ఉదయం వరకూ కొనసాగింది. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన గాలులు తోడు కావడంతో పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. కళ్యాణదుర్గంలో 89.4 మి.మీ, కంబదూరు 65.4, ఆత్మకూరు 60 మి.మీ మేర భారీ వర్షం కురిసింది. బుక్కరాయసముద్రం 55 మి.మీ, నార్పల 48.2, రాప్తాడు 46.4, రాయదుర్గం 45.2, అనంతపురం 42.2, బ్రహ్మసముద్రం 39.2, శింగనమల 32.4, శెట్టూరు 31.8, గార్లదిన్నె 29.4, కూడేరు 28.4, బెళుగుప్ప 25.6, కుందుర్పి 24.6, డి.హీరేహాళ్ 24, కణేకల్లు 23, యల్లనూరు 21.2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఓవరాల్‌గా 25.9 మి.మీ సగటు నమోదైంది. శ్రీ సత్యసాయి జిల్లాలోని కనగానపల్లిలో రికార్డు స్థాయిలో 198.2 మి.మీ కుంభవృష్టి నమోదైంది.

పొంగిన వాగులు..
వానలకు వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహించాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, పెనుకొండ, కొత్తచెరువు, పుట్టపర్తి ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురవడం, అక్కడక్కడా చెరువులు, కుంటలు తెగిపోవడంతో ఆ వరద నీళ్లు రాప్తాడు పరిసరాలు, అనంతపురం శివారు కాలనీలను ముంచేశాయి. వర్షం ధాటికి రాప్తాడు మండలం బండమీదపల్లి చెరువు కట్ట తెగి నీరు పోటెత్తడంతో లావణ్య అనే మహిళకు చెందిన దాదాపు 70 గొర్రెలు మృత్యువాత పడ్డాయి.

రైతులకు కోలుకోలేని నష్టం
భారీ వర్షాలతో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిని రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా రూ.1.76 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అనంతపురం, గార్లదిన్నె, కణేకల్లు, నార్పల, గుమ్మఘట్ట, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్, ఆత్మకూరు మండలాల్లో 27 గ్రామాల పరిధిలో 316 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరి, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, జొన్న తదితర పంటలు దెబ్బతినడంతో 321 మంది రైతులకు నష్టం జరిగింది. పూర్తి స్థాయిలో వివరాలు రావాల్సి ఉన్నందున నష్టం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, మంచి ధరలు ఉన్న సమయంలో వర్షాలు దెబ్బతీస్తున్నాయని టమాట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, కొర్ర, మొక్కజొన్న తదితర పంటలు ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూడు రోజులూ వర్షసూచన..
రాగల మూడు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. భారత వాతావరణశాఖ, అమరావతి కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' ఉందన్నారు. బలమైన ఈదురుగాలులతో పాటు కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదు కావచ్చన్నారు. 23, 24, 25 తేదీల్లో అనంతపురం, బ్రహ్మసముద్రం, ధర్మవరం, గుత్తి, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, మడకశిర, పెనుకొండ, రామగిరి, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ ప్రాంతాల్లో వర్షం పడే సూచన ఉన్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచించారు.



బండమీదపల్లి వాసి లావణ్యకు చెందిన గొర్రెలు మృతి చెందిన దృశ్యం



కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దె వద్ద నేలకొరిగిన మొక్కజొన్న పంట

పండమేరు బీభత్సం

- నీటమునిగిన 'అనంత' శివారు కాలనీలు
- వరద నీటిలో స్థానికుల అవస్థలు



పండమేరు వంక ఉధృతికి అనంతపురం వనమిత్ర పార్కు సమీపంలో నీటమునిగిన ఇళ్లు, గుడిసెలు

రాప్తాడురూరల్/అనంతపురం/రాప్తాడు: భారీ వర్షంతో పండమేరు వంక ఉగ్రరూపం దాల్చింది. సోమవారం రాత్రి ఊహించని రీతిలో కురిసిన వర్షాలకు పొంగిపొర్లింది. కుండపోత వర్షంతో శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి చెరువు కట్ట తెగిపోవడంతో 'పండమేరు' ఉధృతి ఒక్కసారిగా పెరిగిపోయింది. అనంతపురం రూరల్ మండలం, రాప్తాడు మండలాల్లో వంకకు ఇరువైపులా ఉన్న కాలనీలు జలమయమయ్యాయి. గురుదాస్‌కాలనీ, ఆటోకాలనీ, వనమిత్రపార్క్ వెనుక కాలనీలు, రూరల్ పంచాయతీలోని రామకృష్ణకాలనీ, రాప్తాడు మండలంలోని కళాకారుల కాలనీ, బృందావనకాలనీ, పరిటాల సునీతమ్మకాలనీ, దండోరా కాలనీ, రాజరాజేశ్వరికాలనీలు నీట మునిగాయి. బతుకుజీవుడా అంటూ బాధితులు కట్టుబట్ట లతో బయటకొచ్చారు. చాలామందిని జేసీబీల సాయంతో ఇళ్ల నుంచి బయటకు రప్పించారు. ఆటోలు, బైకులు ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు తెలిసింది. అధికారులు ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలను సురక్షితంగా తరలించారు.

- వరద నీటి ఉధృతి వల్ల ప్రాణ భయంతో మిద్దె ఎక్కిన కుటుంబాన్ని అనంతపురం పోలీసులు కాపాడారు. ఎగువ ప్రాంతాల్లో సోమవారం రాత్రి కురిసిన వానతో పండమేరు వంకకు భారీగా వరద నీరు చేరింది. అర్ధరాత్రి టీవీ టవర్ శివారు ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలోకి వరద నీరు రావడంతో దిక్కుతోచని స్థితిలో ఓ కుటుంబం మిద్దె ఎక్కింది. విషయం తెలుసుకున్న అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాస రావు, అగ్నిమాపక శాఖ అధికారి లింగమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మిద్దెపై ఉన్న ఐదుగురిని నిచ్చెనల సాయంతో సురక్షితంగా తీసుకొచ్చారు. పోలీసులను ఎస్పీ అభినందించారు.
- వరద ప్రభావిత ప్రాంతాలపై కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యవేక్షించారు. ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
- ఎస్పీ జగదీష్, జేసీ శివనారాయణ శర్మ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్థానికులకు ఆహార పొట్లాలు, నిత్యావసర వస్తువులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న పండమేరు వంక



పండమేరు వంక నీరు చుట్టూ చేరడంతో ఇంటి పైకి ఎక్కిన వారిని కాపాడిన పోలీసులు



వరద నీరు పోటెత్తడంతో గుడిసెపైకి చేరిన ఓ వ్యక్తి



అభిమానులనుద్దేశించి మాట్లాడుతున్న నాగార్జున



కేరింతలు కొడుతున్న అభిమానులు

అనంతలో గ్రీకువీరుడు

అనంతపురం నగరంలో మంగళవారం సినీనటుడు నాగార్జున సందడి చేశారు. ఓ ప్రముఖ జ్యువెలరీ షాపు ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. నాగార్జునను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

చెరువులపై నిఘా ఉంచండి

అనంతపురం అర్బన్/బుక్కరాయసముద్రం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులపై నిఘా ఉంచాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో నేరుగా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలోని 310 చెరువులు 50 శాతం నీటితో నిండి ఉన్నాయన్నారు. ప్రతి చెరువుకు ఒక వీఆర్‌ఓని కేటాయించాలని ఆదేశించారు. గంటకోసారి నివేదిక పంపించాలన్నారు. యల్లనూరు, నార్పల, కంబదూరు, ఆత్మకూరు, కుందుర్పి మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతపురం రూరల్, కక్కలపల్లి, కట్టకిందపల్లి ప్రాంతాల్లోని వాగుల ప్రవాహంపై, చెరువుల్లో నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. అనంతరం చిక్కవడియార్, అనంత సాగర్ (బీకేఎస్ చెరువు) మరువ పారే ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. చెరువు కట్టపై కంప చెట్లు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూముల పరిశీలన పక్కాగా ఉండాలి : డీఆర్వో

అనంతపురం అర్బన్: అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ పరిశీలన ప్రక్రియ పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని డీఆర్వో జి.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 99 గ్రామాల్లో జరిగిన అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన ఫైళ్ల పరిశీలన ప్రక్రియను కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మంగళవారం చేపట్టారు. భూ పరిపాలన విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్ నేతృత్వంలో డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు చేపట్టిన ఈ ప్రక్రియను డీఆర్వో పరిశీలించి, మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 99 గ్రామాల్లో ఫ్రీహోల్డ్ చేసిన 34,497 ఎకరాలకు సంబంధించి 31,457 ఎకరాల పరిశీలన పూర్తి చేశారన్నారు. ఈ ఫైళ్లను పునఃపరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా 3,164 ఎకరాల పరిశీలన చేయాల్సి ఉందన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాయదుర్గం టౌన్: వ్యక్తిని హతమార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కేసులో హతుడి కుమారుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం సీఐ జయనాయక్ వెల్లడించారు. రాయదుర్గంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన నాయకుల బొమ్మన్న(51) గత శనివారం రాత్రి పెదారగుడ్డం వద్ద ఉన్న తన తోట నుంచి పట్టణానికి వస్తుండగా కుమారుడు నాగరాజు అడ్డుపడి కొడవలితో నరికి హతమార్చిన విషయం తెలిసిందే. అనంతరం తండ్రి మృతదేహాన్ని ఆస్పత్రికి చేర్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తూ వాస్తవం బహిర్గతం కావడంతో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో మెచ్చిరి రోడ్డులోని చింత తోపులో ఉన్న నాగరాజును మంగళవారం అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన మచ్చు కొడవలి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

'పెండేకల్లు'కు నీటి విడుదల

పెద్ద పప్పూరు: చాగల్లు జలాశయం నుంచి మంగళవారం రాత్రి 150 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న పెండేకల్లు జలాశయానికి విడుదల చేశారు. ఈ మేరకు హెచ్చెల్సీ జేఈ హరి తెలిపారు.

సొగసు చూడతరమా!



ప్రకృతి రమణీయ దృశ్యాలు మంగళవారం అనంత వాసులను కనువిందు చేశాయి. సూర్యోదయం సమయంలో అతి పెద్ద ఇంద్రధనుస్సు ఆకట్టుకుంది. మేఘాలను చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూర్యుడి లేలేత కిరణాలు తాకిన వాన చినుకులు అందాల హరివిల్లును ఆవిష్కరించడంతో చూపరులు తమ సెల్‌ఫోన్లలో బంధించి సంబరపడ్డారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

స్పాట్ బిల్లింగ్ టెం'డర్'

- ఉమ్మడి జిల్లాలో 25 సబ్ డివిజన్లకు 413 టెండర్లు
- జిల్లా మొత్తానికి ఒకరు చొప్పున ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి కేటాయింపు
- విద్యుత్ శాఖ అధికారుల ఏకపక్ష నిర్ణయంతో విస్తుబోయిన టెండర్‌దారులు



విద్యుత్ సంస్థ కార్యాలయం

అనంతపురం టౌన్: విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసేందుకు (స్పాట్ బిల్లింగ్) విద్యుత్‌శాఖ అధికారులు చేపట్టిన టెండర్ల నిర్వహణ ఏకపక్షంగా సాగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 విద్యుత్ సబ్ డివిజన్ల పరిధిలో స్పాట్ బిల్లింగ్ తీసేందుకు ఇటీవల టెండర్లను పిలిచారు. మొత్తం 413 టెండర్లు దాఖలయ్యాయి. విద్యుత్ సంస్థ నిర్ణయించిన ధరలో తక్కువ మొత్తానికి టెండర్ వేసిన దరఖాస్తుదారునికి ఖరారు చేయాల్సి ఉండగా. నిబంధనలు తుంగలో తొక్కి అనంతపురం జిల్లాను ఒకరికి, శ్రీసత్యసాయి జిల్లాను మరొకరికి కేటాయించారు. ఎలాంటి అనుభవం లేని వ్యక్తులకు స్పాట్ బిల్లింగ్ టెండర్ కేటాయించడం వెనుక అంతర్యం ఏమిటన్నది విద్యుత్ శాఖ అధికారులకే తెలియాలి.

కాంట్రాక్టర్లకు తెలియకుండానే టెండర్ల ఓపెన్

స్పాట్ బిల్లింగ్ టెండర్ నిబంధనలకు జిల్లా అధికార యంత్రాంగం పాతరేసింది. జిల్లా వ్యాప్తంగా 13 లక్షల విద్యుత్ సర్వీసులన్నాయి. వీటికి ప్రతి నెలా 1 నుంచి 7వ తేదీలోపు బిల్లులు తీసి వినియోగదారులకు అందించేందుకు ఒక సర్వీసుకు అర్బన్ ఏరియాలో రూ.5.49పైసలు, రూరల్ పరిధిలో రూ.5.68పైసలు చొప్పున నిర్ణయించారు. దీంతో పాటు సూపర్ వైజర్ సర్వీస్ కింద 5 శాతం అదనంగా టెండర్ దాఖలు చేసుకోవచ్చు. దీంతో కాంట్రాక్టర్లు ప్రతి సబ్ డివిజన్‌కు 10కి పైగా టెండర్లను దాఖలు చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 413 టెండర్లు విద్యుత్ సంస్థ కార్యాలయానికి చేరాయి. సోమవారం సాయంత్రం విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్లకు తెలియకుండా టెండర్లను ఓపన్ చేసి ఇద్దరు వ్యక్తులకు కేటాయించి చేతులు దులుపుకున్నారు.

నిబంధనలకు పాతర

ప్రతి టెండర్ దరఖాస్తుదారుడు విద్యుత్ శాఖ పేర్కొన్న ధరకే (అర్బన్ రూ.5.59, రూరల్ 5.68పైసలు) టెండర్లను కోట్ చేశారు. ఇందులో ఎలాంటి సూపర్ వైజర్ చార్జీలు లేవు. అందరూ ఒకే ధరకే కోట్ చేశారు. ఇలాంటి తరుణంలో టెండరు దాఖలు చేసిన వారి సమక్షంలో సబ్ డివిజన్ల వారీగా లాటరీ తీసి స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్ట్‌ను కేటాయించాలని విద్యుత్ సంస్థ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అయితే అధికారులు ఈ నిబంధనలు పాటించకుండా ఉమ్మడి జిల్లాను ఇద్దరి వ్యక్తులకు కేటాయించడంతో పాటు అగ్రిమెంట్ల ప్రక్రియనూ శరవేగంగా పూర్తి చేసేశారు. విద్యుత్ శాఖ అధికారుల ఏకపక్ష నిర్ణయంతో టెండర్‌దారులు విస్తుబోయారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా... 'స్పాట్ బిల్లింగ్ టెండర్లు ఓపెన్ చేసిన మాట వాస్తవమే. సబ్ డివిజన్ల వారీగా స్టడీ చేస్తున్నాం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్ట్‌ను కేటాయిస్తాం' అని దాటవేశారు.

స్టాఫ్ నర్సు అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు నేడు

అనంతపురం మెడికల్: నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం స్టాఫ్‌నర్సు అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కో–ఆపరేటివ్ సొసైటీ శాఖాధికారులు పూర్తి చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ ఉంటుంది. 5.30 గంటలకు ఓట్ల లెక్కింపు, తర్వాత విజేతలను ప్రకటిస్తారు. కాగా, స్టాఫ్‌నర్సు అసోసియేషన్ అధ్యక్ష పదవికి కె.చాముండేశ్వరి, సి.పద్మజ, ఆర్‌బీ పద్మావతి, ఉపాధ్యక్ష పదవికి వి.సుజాత, సి.మహాలక్ష్మి, బి.భానులత, ఎ.జలజాక్షి, కార్యదర్శి పదవికి జి.సుజాత, పి.లత, పి.లక్ష్మి, కోశాధికారి పదవికి ఎ.సంధ్య అరుణ, ఎం.నాగమణి, జి.దీప, ఎం.వినోలియా విమలతో పాటు ఈసీ సభ్యులుగా ఏడుగురు నామినేషన్ దాఖలు చేశారు. జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న మొత్తం 246 మంది స్టాఫ్ నర్సులు ఈ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోనున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి



మృతుడు మారెన్న

గుమ్మఘట్ట: విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం కోనాపురం గ్రామానికి చెందిన మారెన్న (60)కు భార్య నీలమ్మ, ఓ కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత గ్రామంలో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో మారెన్న ఇంటికి అనుసంధానం చేసిన విద్యుత్ సర్వీస్ లైన్ తెగి కిందకు పడింది. మంగళవారం తెల్లవారుజామున విషయాన్ని గుర్తించిన మారెన్న తీగలను పక్కకు తొలగిస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే గుమ్మఘట్టలోని పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

అనంతపురం టవర్‌క్లాక్: నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట రంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 450కు పైగా, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 520కు పైగా మార్కులు సాధించిన వారు అర్హులు. అలాగే ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 850, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించి ఉండాలి. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను పూరించి అనంతపురంలోని జయమణెమ్మ కల్యాణమంటపంలో అందజేయాలి. అర్హత సాధించిన వారికి నవంబర్ 24న ప్రతిభ పురస్కారాలు అందజేస్తారు. పూర్తి వివరాలకు 94405 01463, 94412 22874లో సంప్రదించవచ్చు.

యువకుడి దుర్మరణం



మృతుడు భానుప్రకాష్‌రెడ్డి

నార్పల: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని సుల్తాన్‌పేటకు చెందిన నొస్సం రామచంద్రారెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి (19) తన స్నేహితులు సతీష్, ప్రణీత్‌తో కలసి మంగళవారం గూగూడుకు వెళ్లాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు నార్పల శివారులోకి చేరుకోగానే గూగూడు వైపు నుంచే అతి వేగంతో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. భానుప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సతీష్, ప్రణీత్‌ను స్థానికులు వెంటనే జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై నార్పల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రంలో అరాచక పాలన



మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి

- మహిళలకు రక్షణ కరువు
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అరాచక పాలన సాగిస్తూ ప్రజలను మద్యానికి బానిసలుగా మారుస్తున్నారంటూ ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎమ్మెల్యేలు, మంత్రులు బెల్టు షాపులు, జూద కేంద్రాల నిర్వహణలో తలమునకలుగా ఉన్నారంటూ మండిపడ్డారు. మంగళవారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలకు మంత్రి పయ్యావుల కేశవ్ పేరు పెట్టేలా కుట్రలు చేస్తున్నారన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులను బెదిరించి పంచాయతీ సమావేశంలో తీర్మానం చేయించడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోని కేశవ్... వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురి చేసే కుయుక్తులకు తెరలేపారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉరవకొండలో పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసేందుకు డాక్టర్ వైఎస్సార్ హయాంలో 88 ఎకరాలు, వైఎస్ జగన్ పాలనలో 20 ఎకరాలు చొప్పున భూమిని కొనుగోలు చేసి, కాలనీల అభివృద్ధితో పాటు గృహ నిర్మాణాలు చేపట్టామని గుర్తు చేశారు. అయితే పేదలకు ఇంటి స్థలాలు దక్కకుండా తెర వెనుక నుంచి కేశవ్ కుట్రలు సాగించారన్నారు. ఆయనకు ప్రజలపై ప్రేమ ఉంటే ప్రభుత్వం ద్వారా భూములు కొనుగోలు చేయించి పేదలకు పంపిణీ చేసి పేరు పెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, ఎటు చూసినా అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. జగన్ పాలనలో మహిళల రక్షణకు అందుబాటులోకి తెచ్చిన దిశా చట్టాన్ని, పోలీస్ స్టేషన్లను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ మహిళలపై అత్యాచారాలకు సంబంధించి 73కు పైగా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. గత రబీలో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకూ ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సు అందించలేదని, ప్రస్తుతం విత్తనాల పంపిణీ కూడా అరకొరగా చేపట్టారని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సర్పంచులే లక్ష్యంగా టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ బిల్లులు అందకుండా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు వీరన్న, ఎంపీపీ నరసింహులు, పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మల్లికార్జున (ఫైల్)

బుక్కరాయసముద్రం: అప్పు చెల్లింపు విషయంగా గొడవపడి కొట్టుకుని రాజీ అయిన అనంతరం ఓ వ్యక్తి ఉన్న ఫళంగా కుప్పకూలి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు... బీకేఎస్ మండలం కొట్టాలపల్లికి చెందిన మల్లికార్జున (36)కు భార్య మల్లేశ్వరి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న మల్లికార్జున... తన అవసరాల నిమిత్తం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన రఫీ వద్ద రూ.30 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అప్పు చెల్లింపు విషయంగా బీకేఎస్ పరిధిలోని తడకలేరు బ్రిడ్జి వద్ద రఫీ, మల్లికార్జునతో పాటు మరికొందరు సమావేశమై పంచాయితీ నిర్వహించారు. ఆ సమయంలో మాటామాట పెరిగి ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుని పరస్పరం కొట్టుకున్నాయి. అనంతరం రాజీ పడి ప్రతి నెలా కొంత మొత్తం చొప్పున చెల్లించేలా ఒప్పందం చేసుకుని, టీ తాగేందుకు కొట్టు వద్దకెళ్లారు. టీ ఆర్డర్ ఇస్తుండగానే మల్లికార్జున కుప్పకూలాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'ఓపెన్ స్కూల్'ను సద్వినియోగం చేసుకోండి

- ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్



మాట్లాడుతున్న గోవిందనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ విజ్ఞప్తి చేశారు. ఓపెన్ స్కూళ్ల నిర్వహణపై సంబంధిత కో–ఆర్డినేటర్లతో అనంతపురంలోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన సమీక్షించారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31 నాటికి గడువు ముగుస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 2,300 అడ్మిషన్లు అయ్యాయన్నారు. ఈ సంఖ్య మరింత పెంచేలా చూడాలన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి 29 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 30, 31తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతిలో చేరడానికి 14 సంవత్సరాలు నిండిన వారు, ఇంటర్‌లో చేరడానికి పదో తరగతి పాస్ అయి 15 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటనను ఆమోదించాలి

- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటనతో పాటు సీపీఎస్, 117 జీఓ రద్దు అంశాలను రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనతో పాటు జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. 11వ పీఆర్సీ ముగిసి 14 నెలలవుతోందని, ఇప్పటి వరకూ ఐఆర్ ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. ఓపీఎస్ అమలుపై కేబినేట్ నిర్ణయం కోసం సీపీఎస్ బాధితులు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల రంగాన్ని అతలాకుతలం చేస్తున్న జీఓ 117 రద్దుకు కేబినేట్ ఆమోదం తెలపాలన్నారు. తల్లికి వందనం పేరుతో ఇచ్చే ఆర్థిక లబ్ధిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. 12 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఎస్జీటీలను స్కూల్‌అసిస్టెంట్లుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం మేరకు ఉపాధ్యాయులు–విద్యార్థుల నిష్పత్తి నిర్ణయించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో ఉపాధ్యాయుల ఇబ్బందులను తెలుసుకుని రానున్న రోజుల్లో జరిగే శిక్షణలను వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, నాయకులు రమణ, సర్దార్‌వలి, రామకృష్ణ, వన్నప్ప పాల్గొన్నారు.

'అనంత'లో కళ్యాణ్ జ్యువెలర్స్ ప్రారంభం



ప్రారంభోత్సవానికి విచ్చేసిన నాగార్జున

అనంతపురం కార్పొరేషన్: భారతదేశంలోనే అతి పెద్ద, విశ్వసనీయమైన బంగారు ఆభరణాల బ్రాండ్‌లలో ఒకటైన కళ్యాణ్ జ్యువెలర్స్ తన నూతన శాఖను అనంతపురంలోని సూర్యానగర్‌లో మంగళవారం ప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు అక్కినేని నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరోను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో సూర్యానగర్ ప్రాంతం జనసంద్రమైంది. ఈ సందర్భంగా కల్యాణ్ జ్యువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ... ట్రస్ట్ ఈజ్ ఎవ్రీథింగ్ నినాదంతో కంపెనీ చూపుతున్న నిబద్ధత వారిని ప్రత్యేకంగా నిలుపుతోందన్నారు. అనంతపురం ప్రజలను ఇలా కలిసే అవకాశం దక్కిండంపై హర్షం వ్యక్తం చేశారు. ధన్‌తేరస్, దీపావళి పర్వదినాలతో సమానంగా ప్రారంభోత్సవం జరిగిందన్నారు. ఇక్కడ ఆభరణాల ప్రేమికులు ఇకపై ప్రపంచ స్థాయి వాతావరణంలో సేవా ఆధారిత షాపింగ్ అనుభవాన్ని ఆస్వాదించవచ్చునన్నారు. కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ మాట్లాడుతూ... కంపెనీ నిర్వహణలో తాము అనేకమైన మైళ్లను అధిగమిస్తూ వచ్చామన్నారు. ఈ క్రమంలోనే కస్టమర్ షాపింగ్ అనుభవాన్ని మెరుగు పరిచేందుకు అవసరమైన రీతిలో సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో గణనీయమైన పురోగతిని సాధించినట్లు పేర్కొన్నారు. దీపావళి బొనాంజా ఆఫర్‌లో భాగంగా బంగారు నగల మేకింగ్ చార్జీలపై తగ్గింపు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్ఈఎఫ్ జిల్లా నూతన కమిటీ



జిల్లా నూతన కమిటీ సభ్యులతో ఆర్ఈఎఫ్ వ్యవస్థాపకుడు రామచంద్ర

అనంతపురం ఎడ్యుకేషన్: రిజర్వేషన్ ఉద్యోగుల ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) జిల్లా నూతన కమిటీని నియమించారు. ఈ మేరకు అనంతపురం వేదికగా ఆర్ఈఎఫ్ వ్యవస్థాపకుడు రామచంద్ర అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఫెడరేషన్ జిల్లా కమిటీ కో ఆర్డినేటర్‌గా సురేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రగిరి వెంకట నారాయణ, గౌరవ అధ్యక్షుడిగా కోటి మల్లేష్, ఉపాధ్యక్షులుగా వెంకట రమణ, అబ్దుల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బోయ ఉమశంకర్, ఓబులేసు, సెక్రటరీలుగా సుధాకర్, రామ్మోహన్, రామాంజినేయులు, కుళ్లాయప్ప, తిప్పేస్వామి, మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా శశికళ నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర స్టీరింగ్ వైస్ చైర్మన్లుగా వలగొండ రామకృష్ణ, నాగేశ్వరావు, రాయలసీమ అధ్యక్షుడిగా గోవిందరాజులు, రాయలసీమ జాయింట్ సెక్రటరీగా ప్రశాంత్ బాబును ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్టు అపహరణ



శ్రీగంధం చెట్టును నరికిన దృశ్యం

రాయదుర్గం టౌన్: అత్యంత భద్రతా వలయం మధ్య ఉన్న జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్టును దుండగులు అపహరించుకెళ్లారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. రాయదుర్గంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో జడ్జి బంగ్లా ఆవరణలోకి ప్రవేశించిన దుండగులు కటింగ్ మిషన్ ద్వారా ఓ చెట్టును పూర్తిగా కత్తిరించి అపహరించారు. మరో చెట్టును నరికి తీసుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

ఆత్మకూరు: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ తెలియజేశారు. మంగళవారం గొరిదిండ్లతండాలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎల్ఎస్ఏ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్టీ కార్పొరేషన్ అధికారి శంకర్ నారాయణ, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంపీపీ హేమలత, సర్పంచ్ నాగరత్నమ్మ, పంచాయతీ సెక్రటరీ మహబూబ్ బాషా, డాక్టర్ సబిహా సుల్తానా, ఏఓ సుచరిత, మండల ఇంజనీర్లు శివకుమార్, పార్థసారధి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, ఏపీఓ సుజాత, ఏఈఓ సుజిత తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి 'పీఎల్' కృషి



మాట్లాడుతున్న సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దామోదరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: తెలుగుభాషాభివృద్ధికి దివంగత ఆచార్య పీఎల్ శ్రీనివాసరెడ్డి ఎనలేని కృషి చేశారని సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దామోదరరెడ్డి కొనియాడారు. ఆచార్య పీఎల్ శ్రీనివాసరెడ్డి 3వ వర్ధంతిని మంగళవారం శ్రీసాయి డిగ్రీ కళాశాలలో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్కేయూ తెలుగుశాఖలో ఆచార్యుడిగా పని చేసిన శ్రీనివాసరెడ్డి సాహిత్య, తెలుగుభాష అభివృద్ధికి అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌హెచ్ రాజేంద్ర ప్రసాద్, అధ్యాపకులు సిద్దవటం హబీబుద్దీన్, మహిధర్, మాధవి, షెక్షావలి పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

ఆత్మకూరు: మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఓ యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడి వివరాలు మేరకు.. మండల కేంద్రంలో కొందరు మార్వాడి యువకులు కొన్నినెలల నుంచి ఎలక్ట్రికల్స్, హార్డ్‌వేర్, పెయింట్స్ షాపు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి షాపు మూసివేసే సమయంలో ఎవరో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు షాపు వద్దకు వచ్చారని , అందులో ఒక వ్యక్తి ఏదో కొనుగోలు చేయాలని షాపు వద్దకు వెళ్లాడు. దీంతో ఉన్న ఫలంగా ఆ వ్యక్తి మహేంద్ర అనే యువకుడిపై దాడి చేశాడు. యువకుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు అక్కడికిరాగా సదరు వ్యక్తులు కారులో పరారయ్యారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉత్తమ విలువల నిర్మాణమే విద్య లక్ష్యం



ఆశ్రమానికి నిత్యావసరాలనందిస్తున్న సురభి ట్రస్టు సభ్యులు

అనంతపురం కల్చరల్: ఉత్తమ విలువలను నేర్పడమే విద్య యొక్క నిజమైన లక్ష్యమని స్వామి సత్యాత్మానంద అన్నారు. మంగళవారం నగరంలోని కోవూరునగర్ ఛాత్రాలయం ఆశ్రమానికి నిత్య సురభి ట్రస్టు వారు డాక్టర్ నిర్మల ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, విద్యాసామగ్రి అందించడంతో పాటూ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు సత్యాత్మానంద మాట్లాడుతూ ఆశ్రమంలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత విద్య, భోజన వసతి కల్పిస్తున్నామని ఎంతో మంది దాతలు చిన్నారులను ఆదుకుంటుండడం ఆనందంగా ఉందన్నారు. ఆశ్రమ మేనేజర్ చక్రపాణి, సౌదామణి పాల్గొన్నారు.

సనపలో పారిశుధ్య పనులు

ఆత్మకూరు: సనప గ్రామంలో అధికారులు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. 'మురుగుతో ఇబ్బందులు' శీర్షికన ఈనెల20న సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ నరసింహ సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి కమలాకరన్ సోమ, మంగళవారం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ గౌతమి ఆధ్వర్యంలో మురుగునీరు తొలగించడంతోపాటు అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు పంచాయతీ సెక్రటరీ తెలియజేశారు.

పండమేరు పాపం 'తమ్ముళ్లదే'..



పండమేరు వరదకు కారణమైన పరిటాల సునీతమ్మ కాలనీలోని నిర్మాణాలు



కళాకారుల కాలనీలో నీట మునిగిన ఇళ్లు



కళాకారుల కాలనీలో ఇంట్లోకి చేరిన వరద నీరు

- చలపతి గడ్డ(పండమేరు వంక) కబ్జాతో నీటి మునిగిన కాలనీలు
- కట్టుబట్టలతో మిగిలిన ప్రజలు
- సాయం అందక అల్లాడుతున్న వైనం

రాప్తాడు: తెలుగుదేశం పార్టీ నేతల ధనదాహం ప్రజలకు శాపంగా మారింది. ఏకంగా వంక స్థలాన్ని కబ్జా చేయడంతో వరదనీరు వంక పక్కనున్న కాలనీలను ముంచెత్తింది. ఫలితంగా ఆయా కాలనీల ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. ప్రసన్నాయపల్లికి చెందిన కొందరు టీడీపీ నాయకులు కళాకారుల కాలనీ సమీపంలో చలపతి గడ్డ (పండమేరు వంక)ను సైతం కబ్జా చేశారు. ఆ స్థలంలో ఒకటిన్నర సెంటుతో 100 ప్లాట్లు వేసి పరిటాల సునీతమ్మ కాలనీ అంటూ ఒక్కో సెంటు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పేదలకు అమ్మేశారు. అయితే ఆ స్థలం మున్సిపాలిటీదని మున్సిపల్ అధికారులు పదే పదే చెబుతున్నా టీడీపీ నాయకులు దౌర్జన్యంగా నిర్మాణాలు సాగిస్తున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి పండమేరు ఉప్పొంగింది. ఈక్రమంలో పరిటాల సునీతమ్మ కాలనీలోని నిర్మాణాలు అడ్డుగా నిలవడంతో కళాకారుల కాలనీ, రాజరాజేశ్వరి, దండోర కాలనీ, బృందావన కాలనీలను వరద నీరు ముంచెత్తింది. ప్రధానంగా కళాకారుల కాలనీ వాసుల కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఎనుములు, గృహోపకరణాలు పండమేరు వంకలో కొట్టుకుపోయాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తడిసి పనికిరాకుండా పోయాయి. జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి ఆయా కాలనీల్లో పర్యటించారు. సునీతమ్మ కాలనీ ఏర్పాటుతో నీళ్లు తమ కాలనీలోకి వచ్చాయని తెలపడంతో అధికారులు హుటాహుటినా పరిటాల సునీతమ్మ కాలనీ దగ్గర రోడ్డును జేసీబీతో తవ్వడంతో వంక నీరు అనంతపురం చెరువులోకి వెళ్లాయి. దీంతో ఇతర కాలనీలు ముంపు నుంచి బయటపడ్డాయి. ఇదిలా ఉండగా పండమేరు వరద ఉధృతితో గాండ్లపర్తి-జి.కొత్తపల్లి, వరిమడుగు-గాండ్లపర్తి, గాండ్లపర్తి-యర్రగుంట, అయ్యవారిపల్లి-రాప్తాడు, రాప్తాడు-చిన్మయనగర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియ పాఠశాలలోకి నీరు చేరాయి. దీంతో పాఠశాల యాజమాన్యం సెలవు ప్రకటించింది.

అధైర్య పడొద్దండి...అండగా ఉంటా

భారీ వర్షం కురిసిన నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరాశ్రయులైన ప్రజలు అధైర్య పడొద్దని, అన్ని విధాలుగా అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నాయకులు భూమిరెడ్డి మహానందరెడ్డి అన్నారు. పండమేరు ఉధృతికి నీటి మునిగిన కళాకారుల కాలనీ, ఆటోనగర్, ఇందిరమ్మ కాలనీల్లో ఆయన మంగళవారం బాధితులను పరామర్శించారు. వారికి సొంత నిధులతో భోజనం తెప్పించి, ఆయన చేతుల మీదుగా వడ్డించారు. సర్పంచు శశికళ భాస్కర్, ఉప సర్పంచు నాగార్జున, నాయకులు వేల్పుల నాగార్జున, నాగేశ్వర్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, వెన్నపూస చలమా రెడ్డి, వెన్నపూస సంజీవ రెడ్డి తదితరులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

తెగిన చెరువుకట్ట

భారీ వర్షానికి బుక్కచెర్ల, చాపట్ల, ఎం.చెర్లోపల్లి, ఎం.బండమీదపల్లి చెరువులు మరువలు పారాయి. ఎం.బండమీదపల్లి చెరువు మరువు దగ్గర ఉన్న కరకట్ట తెగిపోవడంతో చెరువు నీరు బయటకు రావడంతో దాదాపుగా 74 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. అలాగే 6.4 హెక్టార్లలో మొక్క జొన్న పంట నీట మునిగింది. 24 హెక్టార్లలో వేరుశనగ పంట వరద నీటికి కొట్టుకు పోయింది. అలాగే 15 ఎకరాల్లో అరటి, 20 ఎకరాల్లో బత్తాయి, 10 ఎకరాల్లో మామిడి, 4 ఎకరాల్లో ఉసిరి, 10 ఎకరాల్లో టమోట పంటలు నీటమునిగాయి. ఈ పంటలను హార్టికల్చర్ అధికారి రత్నకుమార్, ఏఓ శేఖర్ రెడ్డి పరిశీలించి, పరిహారం వచ్చేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

చిక్కవడియార్ చెరువులోకి వరద నీరు

బుక్కరాయసముద్రం: జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు బీకేఎస్ మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువులోకి వరద నీరు భారీగా చేరుతోంది. రాప్తాడు, సీకే పల్లి, రామగిరి, కనగానిపల్లి మండలాల్లో కురిసిన వర్షాలకు చెరువులు కుంటలు పొంగి పార్లడంతో వరద నీరు అంతా ఆర్డీటీ స్టేడియం సమీపంలోకి పండమేరు మీదుగా బీకేఎస్ చెరువులోకి చేరుతోంది. బీకేఎస్ శివారు ప్రాంతమైన టీవీ టవర్ ప్రాంతంలో చెరువుకు పక్కన వేసుకున్న గుడిసెల్లోకి వరద నీరు చేరింది. దీంతో నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పోలీసు బృందం పేదలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అదే విధంగా బీకేఎస్ మండలంలోని గోవిందపల్లి, వడియంపేట, రెడ్డిపల్లి గ్రామాలలో 77 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. వ్యవసాయ అధికారులు నివేదికలు తయారు చేసి జిల్లా యంత్రాంగానికి పంపుతున్నారు.

కనగానపల్లి: మండలంలో సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఎప్పుడూ లేనంతగా మండలంలో 198.2 మి.మీ (సుమారు 20 సెం.మీ.) రికార్డు వర్షపాతం నమోదైంది. కనగానపల్లి చెరువు కట్ట తెగిపోవటంతో ఆయకట్టు కింద ఉన్న వంద ఎకరాల్లో వరిమడి దెబ్బతింది. దీంతో రైతులకు రూ.లక్షల పంట నష్టం జరిగింది. ఇక సమీపంలో ఉన్న బీసీ కాలనీలోకి నీరు చేరటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుర్లపల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో భారీ వర్షాలకు వేరుశనగ కొట్టుకు పోవటంతో పాటు కంది, ఆముదం పంటలు నేలకొరిగాయి. దీంతో మండల వ్యాప్తంగా 1000 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ముక్తాపురం చెరువు మరువ నీరు జాతీయ రహదారిపై ప్రవహించింది. దీంతో రహదారి పక్కన ఉన్న ఒక పెట్రోల్ బంక్ నీట మునిగింది. దీంతో పాటు జాతీయ రహదారి వెంట వెళ్తున్న బస్సులు, లారీలు మరువ నీటిలో ఆగిపోవటంతో గంటల కొద్ది ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక దాదులూరు గ్రామంలో పోతలయ్యస్వామి ముందు పెద్ద వంక భారీగా ప్రవహించి గుడి తలుపుల వరకు నీరు చేరింది. కనగానపల్లి సమీపంలోని పండమేరు వంక కూడా భారీగా ప్రవహించింది. భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను, చెరువులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు జిల్లా రైతు సంఘం నాయకులు పరిశీలించారు. వీరితో పాటు తహసీల్దార్ రమాదేవి, ఏఓ క్రిష్ణకుమారితో పాటు ఇతర రెవెన్యూ అధికారులు వర్ష నష్టాన్ని అంచనా వేసేందుకు గ్రామాల్లో పర్యటించారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున వరకు వర్షం కురిసింది. దీంతో చాలా గ్రామాల్లో కుంటలు, వంకలు, బావులు నిండి పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల టమాట, అరటి, వరిపైర్లు నీట మునిగాయి. గాలులకు అరటి పంట నేలకూలింది. ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత నీట మునిగిన పంటలను పరిశీలించి వివరాలను సేకరించారు.

చచ్చిపోతారంటూ ఓ యువకుడు అప్రమత్తం చేయడంతో....

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పండమేరు వంకకు ఆనుకుని ఉన్న కాలనీల్లో మంగళవారం తెల్లవారుజామున వచ్చిన వరదనీటి పట్ల ఓ యువకుడు అప్రమత్తం చేయడంతో చాలామంది ప్రాణాలతో బతికిబట్ట కట్టారు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో బహిర్భూమి కోసం తాను వెళ్లానని అప్పటికే నీటి ఉధృతి ప్రారంభమైందని ఆ యువకుడు చెబుతున్నాడు. చూస్తుండగానే నిముషాల్లోనే నీటి ప్రవాహం అంతకంతకు పెరిగిపోతుండడంతో 'బయటకు వచ్చేయండి...లేదంటే చచ్చిపోతాం అంటూ బిగ్గరగా కేకలు వేస్తూ' ఇళ్ల తలుపులు తడుతూ, రాళ్లతో తలుపులు కొడుతూ శబ్దాలు చేశాడు. దీంతో నిద్రమత్తు వీడిన ఇళ్లలోని వారు బయటకు వచ్చి బతుకుజీవుడా అంటూ కట్టుబట్టలతో పిల్లాపాపలను తీసుకుని ఒడ్డుకు చేరారు. ఆ యువకుడు అప్రమత్తం చేయకపోతే ప్రాణనష్టం జరిగి ఉండేదని పలువురు మహిళలు వాపోయారు.

విధి వంచిత..

రాప్తాడు: పాముకాటుతో కుమారుడు, అనారోగ్యంతో భర్త కన్నుమూశారు. ఆ బాధ నుంచి కోలుకోక ముందే జీవనాధారమైన గొర్రెలు కూడా గంగపాలయ్యాయి. దీంతో సల్లాపురమ్మా ఎందుకింత అన్యాయం చేశావమ్మా అంటూ ఆ మహిళ విలపించిన తీరు చూపరులను కలచి వేసింది. వివరాలు.. ఎం.బండమీదపల్లికి చెందిన లావణ్య కుమారుడు 9 నెలల క్రితం పాము కాటుతో మృతి చెందాడు. గ్రామ చెరువు పక్కనే సల్లాపురమ్మ ఆలయంలో ఆమె భర్త మాధవయ్య పూజారిగా ఉండేవాడు. గత ఐదు రోజుల క్రితం ఆయన కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబానికి జీవనధారంగా ఉండే గొర్రెలను గ్రామ చెరువు సమీపంలో దొడ్డిలో ఉంచింది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువు కట్ట తెగడంతో గొర్రెలు కొట్టుకుపోయాయి. ప్రాణాలకు తెగించి 10 గొర్రెలను కాపాడుకుంది. దాదాపు 70 గొర్రెలు నీటిలో కొట్టుకుపోయినట్లు బాధితురాలు కన్నీరుమున్నీరైంది.



వరద నీటి నుంచి బండిని తీసుకొస్తున్న దృశ్యం



వరద నీటిలో చిక్కుకున్న మహిళలు

ఒక్కరూ ఇబ్బంది పడకూడదు



వరద నీరు ప్రవాహించే మార్గాన్ని మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆయన పర్యవేక్షించారు. అనంతపురం రూరల్, రాప్తాడు పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలకు జేసీ శివనారాయణశర్మ, డీఎంహెచ్ఓ ఈబీదేవి, ఇతర శాఖల అధికారులను పంపించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పనకు ఆదేశాలిచ్చారు. కర్నూలు నుంచి రెండు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను జిల్లాకు తెప్పించారు.

పర్యవేక్షించిన ఎస్పీ



జలమయమైన కాలనీలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: పండమేరు వంక వరద ప్రభావిత కాలనీలు, ప్రాంతాల్లో ఎస్పీ పి. జగదీష్ మంగళవారం పర్యటించారు. డ్రోన్ల ద్వారా ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆయా కాలనీలవాసులతో మాట్లాడారు. ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత డీఎస్పీ, సీఐలకు సూచించారు. ఎస్పీతో అనంతపురం రూరల్ డీఎస్పీ టి. వెంకటేశ్వర్లు, ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్ ఉన్నారు.



కనగానపల్లిలో భారీ వర్షానికి తెగిన చెరువు కట్ట



వెల్దుర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది



బీకేఎస్ చెరువులోకి చేరుతున్న వర్షపు నీరు



కళాకారుల కాలనీవాసులతో మాట్లాడుతున్న భూమిరెడ్డి మహానందరెడ్డి



తడిసిన పత్రాలను ఆరబెట్టుకుంటున్న మహిళ



ఇంట్లో నుంచి టీవీ తెచ్చుకుంటున్న యువకుడు

విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి సారించండి

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ నాయకులు విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని మేయర్ వసీం హితవుపలికారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైపుల్లా బేగ్, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, నరసింహులు తదితర నాయకులతో కలసి మేయర్ విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనంతపురం నగరం రూపురేఖలు మార్చేయడంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. అటువంటి ముందుచూపు కల్గిన వ్యక్తిని విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. అకాల వర్షాలతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో పాటు రబీకి అవసరమైన విత్తనాల ధరలు విపరీతంగా పెరగడం, తుంగభద్ర, హంద్రీనీవాల ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరు రాకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అనంతన్న సూచిస్తే..ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌లు ప్రజలను తప్పుదోవ పట్టించేలా చౌకబారు రాజకీయాలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఆర్బీకే వ్యవస్థను తీసుకువచ్చి రైతులకు విత్తనాలు, ఎరువులు అందించారని, నష్టపోయిన రైతులకు బీమా, గిట్టుబాటు ధర తదితర రైతులకు చేసిన మేలును గుర్తు చేశారు. జిల్లాకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు వస్తున్నాయంటే వైఎస్ఆర్ చలవేనన్నారు. కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, నరసింహులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఏమైందని, ఆగస్టులో కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఏ మేరకు నష్టం వాటిల్లిందనే అంచనాలు వేయలేదన్నారు. నాలుగు నెలల పాలనలో ఎమ్మెల్యే దగ్గుపాటి నగరాభివృద్ధికి ఏం చేశారో చెప్పాలన్నారు.వైఎస్సార్ సీపీ నేతలు కాకర్లశీన, రామచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

రక్షణ మరిచి.. సెల్ఫీ తెరిచి..

కళ్యాణ్ జ్యువెలరీ షాపు ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రముఖ సినీ హీరో నాగార్జునకు అభిమానుల తాకిడి అధికంగా కనిపించింది. రక్షణ కవచంగా ఉండాల్సిన పోలీసులే సెల్ఫీల కోసం చుట్టుముట్టడంతో ఒక దశలో నాగార్జున అసహనానికి గురయ్యారు. పక్కన అసలైన మహిళా అభిమానులు నాగార్జునతో ఫొటోలు దిగడానికి వెళుతుంటే మహిళా పోలీసులు పక్కకు నెట్టడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సెల్ఫీల కోసం హీరో నాగార్జునను చుట్టుముట్టిన పోలీసులు



నాగార్జునను కలిసేందుకు వెళుతున్న మహిళలను అడ్డుకుంటున్న మహిళా పోలీసులు

ముంపు బాధితులకు భోజన వసతి

అనంతపురం కల్చరల్: పండమేరు ముంపు బాధితలైన కళాకారుల కాలనీవాసులకు కాలనీలోని రేమా చర్చిలో మంగళవారం జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం ప్రతినిధి పాస్టర్ మనుష్యే ఉదయం ఫలాహారం, భోజన వసతి కల్పించారు. సంఘకాపరి మనుష్యే, విశ్రాంత సూపరెండెంట్ ఇశ్రాయెల్ పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: పండమేరు వాగు ఉధృతి కారణంగా ఇళ్లల్లోకి నీరు చేరి నిరాశ్రయులైన ఉప్పరపల్లి పంచాయతీలోని వివిధ కాలనీల ప్రజలకు గ్లోరియస్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ (గ్లోరియస్ చర్చి) అండగా నిలిచింది. సొసైటీ ఫౌండర్ కే.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో గ్లోరియస్ చర్చిలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. బాధితులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేయడంతో పాటు వసతి కల్పించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆత్మకూరు: పి. యాలేరు గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి ఇంటి స్థల ఆవరణలో 24 కేసుల కర్ణాటక మద్యం లభించింది. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జాకీర్ తెలిపారు.

చేతివృత్తిదారులకు రుణాలివ్వాలి

అనంతపురం రూరల్: చేతివృత్తి దారులకు రుణాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లింగమయ్య మాట్లాడుతూ కులవృత్తులనే నమ్ముకొని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎన్నికల్లో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ అందిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించారని మండిపడ్డారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో 'భాష్యం' విద్యార్థి ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీల్లో నగరంలోని భాష్యం పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటాడు. ఇటీవల రామచంద్రాపురంలో జరిగిన ఈ టోర్నీలో తమ పాఠశాల విద్యార్థి జి. షణ్ముఖ విజేతగా నిలిచాడని యాజమాన్యం పేర్కొంది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థి షణ్ముఖను అభినందించారు. భాష్యం విద్యాసంస్థల జిల్లా జెడ్ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, హెచ్ఎం, పీఈటీలు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో డిప్యూటీ మేయర్



చెట్టు తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. రైల్వేస్టేషన్ వినాయక ఆలయ సమీపంలో కూలిన మహావృక్షాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అక్కడి చేరుకుని పనులను పర్యవేక్షించారు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.